గ్రామ/వార్డు వాలంటీర్ల, గ్రామ/వార్డు సచివాలయాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.

సంపుటి: 1 | సంచిక: 8 | ఆగస్టు - 2021



# గ్రామ స్వరాజ్యం

మాస పత్రిక

youtube.com/gswstrainings facebook/gswsap twitter/GSWSOfficial instagram/gswsoficial gswsmedia@gmail.com

ఓ లుక్కేయండి

సచివాలయాల్లో క్షేత్రస్థాయి తనిఖీలు జరగాలి............. 2లో

లెటర్స్ టు డైరెక్టర్............. 3లో

'ఆడ'నిద్దాం....................... 3లో

ఉత్తమ స్నేహితుడు............ 3లో

నాణ్యతా ప్రమాణాల్లో భేష్................................ 4లో

గ్రామ,వార్డు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు.............. 5లో

మనుషుల మధ్య గోడలను కూల్చేసే నవల................... 5లో

మాస్కు ఉంది సరే దాన్నెలా ధరిస్తున్నారు?...... 6లో

మాస్కే కవచం.................. 6లో


చెంప దెబ్బ........................ 7లో

సత్య గీతం........................ 7లో

సేవకు చిరునామా............ 8లో

రచనలు పంపండి............ 8లో

సచివాలయ ఉద్యోగుల శిక్షణ కోసం యూట్యూబ్ చానల్............................ 8లో




# వైఎస్ఆర్ బీమా

# పేదకుటుంబాలకు ధీమా

**ఏదైనా కారణం చేత ఇంటి పెద్ద మరణిస్తే ఆ ఇల్లు అనాథ కాకూడదు. అందుకే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారి ప్రభుత్వం 'వైఎస్ఆర్ బీమా' పథకాన్ని ప్రవేశపెట్టింది. బియ్యం కార్డుతో పాటు పట్టణాల్లోని వారైతే 12 వేల రూపాయలు గ్రామాల్లోని వారైతే 10వేల రూపాయల లోపు ఆదాయం కలిగి ఉండాలి. వయసు కూడా 18 నుంచి 70 ఏళ్లలోపు ఉండాలి.**

ఈ అర్హతలు ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వం బీమా వర్తింపజేసింది. ఆగస్టు 4వ తేదీ నాటికి రాష్ట్రంలోని అర్హులైన 1.32 కోట్ల మందికి బీమా వర్తింపజేశారు. 18 నుంచి 50 సంవత్సరాల లోపు వారు సహజ మరణం పొందితే ఈ పథకం కింద ప్రభుత్వం నేరుగా నామినీ అకౌంటుకు లక్ష రూపాయలు జమ చేస్తుంది. అదే విధంగా 18 నుంచి 70 సంవత్సరాల లోపు వారు ఏదైనా ప్రమాదంలో చనిపోతే Universal Sompo General insurance Co. Ltd చేత 5 లక్షల రూపాయల బీమా వర్తింపజేస్తుంది. సంఘటన జరిగిన 30 రోజుల్లోపు బాధితులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

ఈ పథకాన్ని గౌరవ ముఖ్యమంత్రి శ్రీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జూలై 1, 2021న తన క్యాంపు కార్యాలయంలో లాంఛనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏమన్నారంటే...

## ప్రతి పేద కుటుంబానికి అండగా ఉంటాను

"బీమా పథకం నుంచి కేంద్రం తప్పుకున్నా- బ్యాంకులు, ఇన్సూరెన్సు సంస్థ నుంచి ఇబ్బందులు ఎదురైనా రాష్ట్ర ప్రభుత్వమే మొత్తం బీమా భారం భరిస్తోంది. ఇంటి పెద్ద చనిపోయినప్పుడు ఆ కుటుంబం పడే బాధలను నేను స్వయంగా పాదయాత్రలో చూశాను. అందుకే ఈ అంశాన్ని మేనిఫెస్టోలో చేర్చాము. ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వం పెద్ద దిక్కుగా ఉంటుంది.

2లో



(మొదటి పేజీ తరువాయి)

బీమా నమోదు, క్లెయిమ్ చెల్లింపుల్లో ఫిర్యాదులకు సంప్రదించవలసిన టోల్ ఫ్రీ నెంబర్ : **155214**

### టోల్ ఫ్రీ నెంబరు ఏర్పాటు

ఈ బీమా విషయంలో ఎవరికైనా ఏదైనా సమస్య ఉంటే 155214 అనే టోల్ ఫ్రీ నెంబరకు ఫోన్ చేయవచ్చు. అలాగే గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లను అడిగి తెలుసుకోవచ్చు.

### గ్రామ, వార్డు సచివాలయాల పర్యవేక్షణ

ఏ నెలలో ఘటన జరిగితే ఆ నెలలోనే బీమా అందించేలా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు సహాయం చేస్తారు. సంఘటన జరిగిన వెంటనే బాధిత కుటుంబంతో ఇన్సూరెన్సు కోసం దరఖాస్తు చేయిస్తారు. వెరిఫికేషన్ పూర్తవగానే క్లయిమ్స్ అన్నీ జాయింట్ కలెక్టర్లకు వెళ్తాయి. వారు త్వరితగతిన స్పందించి బీమా సొమ్ము విడుదల అయ్యేలా చర్యలు తీసుకుంటారు.

**YSR BIMA District wise Enrollment Status as on 04.08.2021 @ 05:20 PM**

| Sl. No | District Name | Total | Ekyc Updated | Ekyc Not yet Updated | Invalids | Total Surveyed | Surveyed Percentage (%) |
|---|---|---|---|---|---|---|---|
| 1 | KRISHNA | 1309316 | 1012106 | 6 | 297165 | 1309271 | 100.00 |
| 2 | KURNOOL | 1220068 | 912406 | 60 | 307602 | 1220008 | 100.00 |
| 3 | CHITTOOR | 1154156 | 843976 | 60 | 310058 | 1154034 | 99.99 |
| 4 | GUNTUR | 1491412 | 1087302 | 16 | 403889 | 1491191 | 99.99 |
| 5 | PRAKASAM | 1006053 | 698733 | 2 | 307253 | 1005986 | 99.99 |
| 6 | VIZIANAGARAM | 717854 | 571464 | 4 | 146351 | 717815 | 99.99 |
| 7 | WEST GODAVARI | 1257895 | 963526 | 40 | 294255 | 1257781 | 99.99 |
| 8 | SPSR NELLORE | 891233 | 642749 | 870 | 247209 | 889958 | 99.86 |
| 9 | ANANTHAPUR | 1220762 | 908532 | 797 | 310187 | 1218719 | 99.83 |
| 10 | YSR KADAPA | 818516 | 603233 | 489 | 213467 | 816700 | 99.78 |
| 11 | EAST GODAVARI | 1653364 | 1273395 | 1294 | 374625 | 1648020 | 99.68 |
| 12 | SRIKAKULAM | 832132 | 616192 | 2328 | 212961 | 829153 | 99.64 |
| 13 | VISAKHAPATNAM | 1253439 | 956261 | 5204 | 288588 | 1244849 | 99.31 |
| Total | | 14826200 | 11089875 | 11170 | 3713610 | 14803485 | 99.85 |

రిపోర్టు: బూశెట్టి వెంకటయ్య, నోడల్ ఆఫీసర్,
గ్రామ, వార్డు సచివాలయాల శాఖ, విజయవాడ.

# సచివాలయాల్లో క్షేత్రస్థాయి తనిఖీలు జరగాలి

- అధికారులు స్వయంగా వెళ్లి వెరిఫికేషన్ ప్రాసెస్, సిబ్బంది పనితీరు, నిర్వహణను పరిశీలించాలి
- పేదలను పట్టించుకోకపోతే మన విధులను సరిగా నిర్వర్తిస్తున్నట్లు కాదు
- బియ్యంకార్డు, పెన్షన్ కార్డు, ఇళ్ల పట్టాలు, ఆరోగ్యశ్రీ అత్యంత ముఖ్యమైనవి
- నిర్దేశిత సమయంలోగా ప్రతి అర్హుడికీ అవి అందాలి
- 'స్పందన'లో కలెక్టర్లు, ఎస్పీలు, జేసీలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్గనిర్దేశం



ప్రజలకు పలు రకాల సేవలందించే సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలకు జిల్లా అధికార యంత్రాంగం చేరువ కావాలని అప్పుడే వీటి సమర్థత మెరుగుపడుతుందని, వీటి పనితీరుపై కలెక్టర్లు, జేసీలు, సబ్ కలెక్టర్లు, ఐటీడీఏ పీవోలు, మునిసిపల్ కమిషనర్లు నిర్దేశించిన ప్రకారం తప్పనిసరిగా తనిఖీలు నిర్వహించాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. తనిఖీల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారికి మెమోలు జారీ చేయాల్సిందిగా తన కార్యాలయాన్ని సీఎం ఆదేశించారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తేనే తప్పులు, పొరపాట్లు ఏమైనా ఉంటే తెలుస్తాయని, వాటిని అంతా కలసి సరిచేసుకుందామన్నారు. 'స్పందన'లో భాగంగా సీఎం జగన్ జూలై 27న తన క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్లు, ఎస్పీలు, జేసీలు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు.

**వెరిఫికేషన్ పూర్తయిన తర్వాత అర్హులని తేలితే, అప్పటిదాకా వారికి పథకం రాకపోతే కచ్చితంగా ఆ తప్పులను సరిదిద్దుకోవాలని సూచించారు. అధికారులే తన కళ్లు, చెవులు అని అందుకే అందరూ తప్పకుండా క్షేత్రస్థాయి తనిఖీలకు వెళ్లాలని నిర్దేశించారు. అధికారులు విఫలమైతే తాను విఫలమైనట్టే అని అందరం కలసి ఒక జట్టు మాదిరి పని చేయాలని సూచించారు.**

అధికారులు క్షేత్రస్థాయి తనిఖీలకు వెళ్తే ప్రజలకు మంచి జరుగుతుందని చెప్పారు. క్షేత్రస్థాయి తనిఖీలు చేస్తున్నప్పుడు వివిధ పథకాలకు సంబంధించిన పోస్టర్లను సచివాలయాల్లో ఉంచుతున్నారా? లేదా? అర్హుల జాబితాలను అతికిస్తున్నారా? లేదా? సంక్షేమ క్యాలెండర్ ఉందా? లేదా? ప్రభుత్వానికి సంబంధించిన ముఖ్యమైన ఫోన్ నంబర్లు అక్కడ ఉన్నాయా? లేదా? అనేవి పరిశీలించాలని కోరారు.

అర్హులైనప్పటికీ వారికి ఏదైనా పథకం వర్తించకుంటే ఎవరికి ఫిర్యాదు చేయాలో సూచించే నంబర్లను అక్కడ పొందుపరచాలని చెప్పారు. సచివాలయాల ద్వారా అందుతున్న సేవల జాబితాను తెలియచేసే వివరాలను ప్రదర్శిస్తున్నారో లేదో చూడాలన్నారు. వివిధ సేవలన్నీ నిర్దేశిత సమయంలోగా అందుతున్నాయో లేదో కూడా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడైనా లోపాలుంటే తమ దృష్టికి తీసుకురావాలని అప్పుడే పేద ప్రజలకు ఇబ్బంది కలగకుండా సవరించే అవకాశం ఉంటుందని చెప్పారు.

# లెటర్స్ టు డైరెక్టర్

**శ్రీ. ఎస్. షన్మోహన్ గారు,**
ఐఏఎస్,
డైరెక్టర్, గ్రామ, వార్డు
సచివాలయాల శాఖ,
ప్లాట్ నెంబరు: 11, 12,
ఫైర్ స్టేషన్ వెనుక,
ఏపి ఐఐసి కాలనీ దగ్గర,
జవహర్ ఆటోనగర్,
విజయవాడ, కృష్ణాజిల్లా.
gswsmedia@gmail.com

**నమస్కారం సార్..**

**ప్ర** నేను వాలంటీర్‌గా గత రెండు సంవత్సరాలుగా పనిచేస్తున్నాను. వాలంటీర్ సమస్యలు తెలియజేయడానికి 'గ్రామస్వరాజ్యం' మాస పత్రికలో 'లెటర్స్ టు డైరెక్టర్' శీర్షికను నిర్వహిస్తున్నందుకు మీకు ధన్యవాదాలు. వాలంటీర్లకు సంబంధించిన నిర్దిష్టమైన జాబ్ చార్ట్ ఏదైనా ఉంటే దయతో విడుదల చేయగలరు. జాబ్ చార్ట్ లేకపోవడం వల్ల ఏ పని తమ పరిధిలో వస్తుందో ఏ పని రాదో తెలియక చాలామంది ఇబ్బంది పడుతున్నారు. పైగా వాలంటీర్ వ్యవస్థ గురించి ఒక్కొక్కరు ఒక్కో విధమైన అర్థాలు ఇస్తుండటం గందరగోళానికి దారితీస్తోంది. దయతో సమస్యను పరిశీలించగలరు.

**ఇట్లు,**
బోయ మాధవస్వామి,
కలుగోట్ల సచివాలయం, ఎమ్మిగనూరు, కర్నూలు.

**జ** **మాధవ స్వామి గారు,**
మీకిచ్చిన 'ఆఫర్ లెటర్ 'లోనే మీ విధులేంటో స్పష్టంగా పొందుపరిచి ఉన్నాము. ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారథులు మీరు. ప్రభుత్వపథకాలను ఎప్పటికప్పుడు ప్రజల దగ్గరకు అనుకున్న సమయానికి చేర్చడమే ప్రధానంగా వాలంటీర్లు చేయాల్సిన పని. మీ క్లస్టర్ పరిధిలో ఉన్న కుటుంబాలకు, మీరు పని చేసే సచివాలయానికి మధ్య మీరు అనుసంధానకర్తగా ఉండాలి. ఎప్పటికప్పుడు వివిధ సంక్షేమ పథకాలను ప్రజలకు తెలపడం అర్హులైన వారందరితో దరఖాస్తు చేయించి వారికి లబ్ధి చేకూర్చడం మీరు చేయాల్సిన పని. ఈ విషయాలను ఇప్పటికే అనేక సార్లు వివిధ ఉత్తర్వుల ద్వారా కూడా తెలిపి ఉన్నాము. లెటర్స్ టు డైరెక్టర్ కు స్పందించినందుకు ధన్యవాదాలు.

– డైరెక్టర్

**నమస్కారం సార్..**

**ప్ర** గ్రామ సచివాలయంలో కొత్తగా నియమితులైన ఉద్యోగులకు సర్వీస్ రిజిస్టర్‌లను ఆయా డిపార్టుమెంట్లకు విడివిడిగా అప్పగించారు. దీంతో ఎవరూ కూడా గ్రామ సచివాలయాన్ని తమ సంస్థగా భావించడం లేదు. మెజారిటీ సచివాలయాల్లో ఉద్యోగులు సచివాలయంతో తమకేం సంబంధం లేనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో సచివాలయం స్ఫూర్తి దెబ్బతింటోంది. కావున సర్వీస్ రిజిస్టర్‌ల నిర్వహణ సచివాలయ శాఖే నిర్వహించేలా చర్యలు తీసుకుంటారని మనవి.

**ఇట్లు**
పంచాయతీ కార్యదర్శి, కమలాకర్ణ,
ఈదుల ముష్టూర్ సచివాలయం, అనంతపురం జిల్లా.

**జ** గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగులకు భవిష్యత్తులో పదోన్నతుల విషయంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండటం కోసమే ఆయా డిపార్టుమెంట్లకు అనుసంధానం చేశాము. సర్వీస్ రిజిస్టార్ లను ఆయా డిపార్టుమెంట్లు నిర్వహించడం వల్ల ఉద్యోగులకు మేలు జరుగుతుంది. ఇక సచివాలయాల్లో బాధ్యతలు నిర్వర్తించే విషయంలో ఎవరూ అలక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజూ సచివాలయాల పరిధిలో 'స్పందన' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాము. ఎలాంటి డిప్యుటేషన్లు లేకుండా ఉద్యోగులంతా సచివాలయ పరిధిలోనే పనిచేసేలా చర్యలు తీసుకున్నాము అంతేకాదు అటెండెన్స్ కూడా తీసుకుంటున్నాము. అందుచేత సచివాలయాల స్ఫూర్తి దెబ్బతినే అవకాశం ఉండదు. అయినప్పటికీ మీరు చేసిన సూచనను పరిగణనలోకి తీసుకుంటున్నాను. ధన్యవాదాలు.

– డైరెక్టర్

## కవితా గగనం


### 'ఆడ'నిద్దాం

ఆడపిల్లను 'ఆడ'పిల్లనే అని ఆడనియ్యం మనం...
ఇప్పుడు ఆమె గెలి'చాను' అని బరువెత్తి పాడగానే
'లఫ్లీ'గా రింగ్‌లో దూకి కోరస్ ఇస్తుందికో ఆమె...
వీరితో కలిసి ఇంకో ఆమె భరతమాత నుదుట
అ'ద్వితీయ'మైన రీతిలో
"సింధూ"రం దిద్దుతుంది...
ఆడ గెలిచింది మన ఆడోళ్లే
అని మరిచిపోకుండా
ఆడోళ్లను కూడా
అన్ని ఆటలూ ఆడనిద్దాం...
ఎల్లలు దాటిన ఉత్సాహంతో
పతకాల
ముల్లెలు తెస్తారు...

– అల్లాడి శ్రీనివాస్,
మంచిర్యాల.



### ఉత్తమ స్నేహితుడు



ఏ కష్టం వచ్చినా వాడు నాకు భరోసా
నా కన్నీళ్లు చూస్తే వాడి గుండెల్లో కల్లోలం
తనువు నేనైతే ఊపిరి వాడు
వాలి సుగ్రీవులు ఈర్ష్యడే స్నేహం మాది
కృష్ణ కుచేలులు ఎరుగని మైత్రి మాది
కర్ణ దుర్యోధనాదులైనా ఇష్టపడే మిత్రబంధం మాది
నా అంతిమ సంస్కారాలకు ఆ నలుగురు రానక్కరలేదు
కన్నీరు పెట్టే బంధుగణం అవసరం లేదు
పున్నామ నరకం దాటించే పుత్రుడక్కరలేదు
వాడొకడు, కడచూపు కొసం వస్తే చాలు
వాడున్నాడన్న సంతోషంతో నా ఆత్మశాంతిస్తుంది
ఎందుకంటే వాడి మరణం ఊహలో కూడా నేను తట్టుకోలేను
వాడే నా ఉత్తమ స్నేహితుడు
మరో జన్మకైనా వాడే నా మిత్రుడు కావాలి.

– నాదెళ్ల వెంకటాచలపతి, కదిరి 9440253355









# నాణ్యతా ప్రమాణాల్లో భేష్

## కృష్ణా జిల్లాలోని 141 గ్రామ, వార్డు సచివాలయాలకు ఐఎస్ఓ గుర్తింపు

కృష్ణాజిల్లాలోని 141 మోడల్ సచివాలయాలకు ఐఎస్ఓ గుర్తింపు లభించింది. రాష్ట్రంలోని 15004 గ్రామ, వార్డు సచివాలయాలను మోడల్ సచివాలయాలుగా మార్చాలని నిర్ణయించిన ప్రభుత్వం మొదట కృష్ణా జిల్లాలో ప్రయోగాత్మకంగా కొన్నింటిని ఎంపిక చేసింది. ప్రతి మండలానికి రెండు చొప్పున గ్రామ స్థాయిలో 98 సచివాలయాలను, ప్రతి మున్సిపాలిటీలో రెండు చొప్పున పట్టణ స్థాయిలో 16 వార్డు సచివాలయాలను ఎంపిక చేసి వాటిల్లో అనేక సదుపాయాలు కల్పించింది.

ఈ ఆదర్శ (మోడల్) సచివాలయాల్లో అన్ని రకాల ఆఫీసు రికార్డులను సక్రమంగా నిర్వహించడంతో పాటు ప్రతి మూడు నెలలకు ఒకసారి ముగ్గురు మండలస్థాయి అధికారులతో అంతర్గత ఆడిటింగ్ నిర్వహిస్తున్నారు. ఎప్పటికప్పుడు వివరాలను నోటీస్ బోర్డులో అంటించి ఆద్యంతం పారదర్శకంగా లబ్ధిదారుల జాబితాను ఎంపిక చేస్తున్నారు. అలాగే ప్రతి సచివాలయంలో సంక్షేమ పథకాల కేలండర్‌ను అతికించి ఎప్పటికప్పుడు లబ్ధిదారులకు వివరాలు తెలిసేలా చేస్తున్నారు.

బయోమెట్రిక్ హాజరును తప్పనిసరిగా పాటిస్తున్నారు. సిసి కెమెరాలు అమర్చారు. ఉద్యోగులందరికీ యూనిఫామ్స్ ఇచ్చారు. అలాగే ప్రతి గ్రామ, వార్డు సచివాలయంలో Suggestion బాక్సును ఏర్పాటు చేశారు. ఫస్ట్ ఎయిడ్ కిట్‌లను ఉంచారు. విభిన్న ప్రతిభావంతుల కోసం



ప్రత్యేకంగా ర్యాంపులను నిర్మించారు. మొబైల్ ఫోన్లను రీఛార్జ్ చేసుకునే ఏర్పాటు, లబ్ధి దారులు వేచి ఉండాల్సి వస్తే వారికోసం ప్రత్యేకమైన గదిని ఏర్పాటు చేశారు.

ఇలాంటి సౌకర్యాలతో ప్రతీదీ ఆన్‌లైన్ చేసి వేగవంతంగా, నిర్ణీత సమయం లోపల సేవలు అందించేలా రూపొందించిన ఈ మోడల్ సచివాలయాలు ఇప్పుడు అందరినీ ఆకట్టుకుంటున్నాయి.

అంతర్జాతీయ స్థాయిలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్న సచివాలయాలకు ఐఎస్ఓ గుర్తింపు కోసం దరఖాస్తు చేయగా నిపుణులు రాష్ట్రమంతా తిరిగి అన్ని విధాలుగా పరిశీలించి కృష్ణా జిల్లాలోని 141 మోడల్ సచివాలయాలకు సర్టిఫికెట్లు ఇచ్చారు.

ఈ సందర్భంగా గ్రామ, వార్డు సచివాలయాల మంత్రి శ్రీ. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గారు మోడల్ సచివాలయాల బాధ్యులందరికీ అభినందనలు తెలిపారు. జూలై 22న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులకు సర్టిఫికెట్లు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

మరోవైపు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ గారు, రాష్ట్ర డైరెక్టర్ షన్మోహన్ గారు మోడల్ సచివాలయాల నిర్వాహ కులకు శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరింత బాధ్యతగా పనిచేయాలని సూచించారు.

**1,285** కృష్ణా జిల్లాలో మొత్తం గ్రామ, వార్డు సచివాలయాలు

**11,579** మంది ఉద్యోగులు

**22,292** మంది వాలంటీర్లు



## గ్రామ,వార్డు సచివాలయాల్లో

# రిజిస్ట్రేషన్ సేవలు


గ్రామ, వార్డు సచివాలయాల్లో త్వరలో భూముల రిజిస్ట్రేషన్ సేవలు మొదలు కానున్నాయి. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ వై. ఎస్. జగన్ మోహన్ రెడ్డి గారి ఆదేశాల మేరకు మొదటి విడతలో ప్రయోగాత్మకంగా రాష్ట్రంలోని 51 గ్రామ, వార్డు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు మొదలుపెడుతున్నారు. ఈ మేరకు ఎంపిక చేసిన సచివాలయాల్లో 4Mbps కి తక్కువ కాకుండా నెట్ కనెక్షన్ ఇవ్వాల్సిందిగా ఏపీ స్టేట్ ఫైబర్ నెట్ వారికి ఆదేశాలు జారీ అయ్యాయి. అలాగే వీలైనంత తొందరలో సేవలు మొదలుపెట్టేందుకు కావాల్సిన ఇతర సౌకర్యాలనూ కల్పిస్తున్నారు. మరోవైపు ఎంపిక చేసిన సచివాలయాల్లోని సెక్రటరీలకు, డిజిటల్ అసిస్టెంట్లకు ట్రయినింగ్ క్లాసులు నిర్వహించారు.

ఇదిలా ఉంటే అనంతపురంలో 5, చిత్తూరులో 4, తూర్పు గోదావరిలో 6, గుంటూరులో 5, కృష్ణాలో 4, కర్నూలులో 3, ప్రకాశంలో 3, నెల్లూరులో 5, శ్రీకాకుళంలో 3, విశాఖలో 4, విజయనగరంలో 2, పశ్చిమగోదావరిలో 4, వైఎస్ఆర్ కడపలో 3 సచివాలయాల్లో మొదటి దశలో రిజిస్ట్రేషన్ సేవలు మొదలుకానున్నాయి.

# మనుషుల మధ్య గోడలను కూల్చేసే నవల

## బుక్ పాయింట్

**నిత్య జీవితంలో మనం తరచూ చూసే పాత్రలనే ఒక చోట చేర్చారా అన్న భావన కలుగుతుంది "కూలిన గోడలు.." నవల చదివితే. బతికున్న వారికి మర్యాద ఇవ్వకపోయినా .. చనిపోయిన వారి కోరిక, మాటకు తప్పక గౌరవం ఇచ్చి తీరాలన్నది పెద్దలమాట. అందులోనూ ఆ చనిపోయినవారు మనకెంతో ఇష్టమైన వారైతే ఆ బాధ్యత రెట్టింపు అవుతుంది. ఆ బాధ్యతను నిర్వర్తించకపోవడం వల్ల కలిగిన పర్యవసానమే నవలకు మూలం.**




అత్తారింటికి వెళ్లిన కల్యాణి నిత్యం కన్నవారి సంతోషం కోసం తపిస్తుంది. తనకున్న ఇద్దరి బిడ్డల్లో చిన్నవాడైన మధుని చిన్నాన్న కూతురు సుధకు ఇచ్చి వివాహం చేయాలని ఆనాడే నిర్ణయించింది... అందరి అంగీకారంతో!

కొద్దీ రోజుల్లోనే ఒక మూగ కూతురికి జన్మనిచ్చి ప్రాణాలు వదిలిన కల్యాణికి.. తన ముచ్చట తీర్చుకునే అవకాశం లేకపోయింది. పెద్దన్న విశ్వనాధం బొత్తిగా మూర్ఖత్వం ఉన్న మనిషి. ఆయనకు పిల్లలు లేకపోవడంతో తమ్ముడు, చెల్లెలి పిల్లలపై తానే పెత్తనం చేస్తుంటాడు. రోజులు గడిచే కొద్దీ చెల్లెలి పిల్లలపై తన అరాచకాలు పెరుగుతూ వస్తాయి. ఇవన్నీ చూడలేని కల్యాణి తల్లి సుందరమ్మ కూతురి బిడ్డలతో ఆ ఇంటిని వదిలి బయటకు వచ్చేస్తుంది.

కాయకష్టం నమ్ముకున్న కల్యాణి బిడ్డలిద్దరూ మంచి ఉద్యోగాల్లో స్థిరపడతారు. కూతురు మూగదైనా మనసు బంగారం. మాట రాకపోయినా సుగుణాల రాసి కనుకనే.. పెద్ద వదిన తన అన్నతో వివాహం జరిపిస్తుంది.

కొన్నాళ్లకు తల్లి కోరిక మేరకు చుట్టాలు, బంధువులతో మేనమామ కూతురిని తన తమ్ముడికిచ్చి పెళ్లిచేయమని అడగడానికి బయలుదేరుతాడు కల్యాణి పెద్ద కొడుకు సూర్యం. అహంకారం తగ్గని విశ్వనాధం పెళ్లికి ఒప్పుకోక అందరి ముందు వారిని అవమానించి పంపుతాడు. ఆ దిగులుతో కొద్ది రోజులకే ప్రాణాలు వదిలేస్తుంది కల్యాణి తల్లి సుందరమ్మ.

విశ్వనాధం మొండి పట్టుదలతో సుధకు వేరే సంబంధం చూసి పెళ్లి చేసినా అక్కడ పొసగక పుట్టిల్లు చేరుతుంది సుధ. మేనమామలు ఇద్దరూ గొడవలు పడి వేరు పడతారు. పరిస్థితి తెలుసుకున్న మధు చిన్నమామను ఓదార్చడానికి వెళ్లి సుధకూ ధైర్యం చెప్పి నచ్చచెబుతాడు.

అన్నా వదినల సహకారంతో మధు ఒక గొప్ప రచయిత్రి శారదా దేవితో వివాహానికి సిద్ధమవుతాడు. చిన్నప్పటి నుంచి అత్తమామల దగ్గర చీవాట్లు, దెబ్బలు తిన్నా.. అమ్మ లాంటి వదిన రావడంతో మధు బాధలు గట్టెక్కుతాయి.

పేకమేడల లాంటి అందమైన ఊహలన్నీ ఒకేసారి కూలిపోయినప్పటికి.. ఆత్మాభిమానం కల మధు, సూర్యలు కష్టాన్ని నమ్ముకుని మళ్ళీ కలల సౌధాన్ని నిర్మించుకుంటారు. అహంకారం, అధికార దర్పం కలిగిన విశ్వనాధం లాంటి వాళ్ళు చాలా చోట్ల తారసపడుతూనే ఉంటారు. చివరాఖరిలో తమ నిర్ణయాలే పశ్చాత్తాప కారణాలుగా తలచుకుంటూ.

మనల్ని మనం అర్ధం చేసుకోగలిగితే.. చుట్టూ ఉన్న సమాజంపై నిందలు వేసే పరిస్థితి, అవసరం రాదు. ఆలస్యంగా అయినా ఏది తప్పో, ఏది ఒప్పో తెలుసుకోవాలి గాని.. చేసిన తప్పు మళ్ళీ మళ్ళీ చేయకూడదు అన్న రచయిత్రి గొప్ప భావన మనల్ని ఆలోచనల వైపు తీసుకెళ్తుంది.



– అమ్ము, బమ్మిడి,

కోస్ట మహిళా పోలీస్, రణస్థలం.

# మాస్కు ఉంది సరే.. దాన్నెలా ధరిస్తున్నారు?

**మన ఆరోగ్యం**

'టీకా వేయించుకున్నాం ఇక మాస్కుతో పని లేదు' అనే పరిస్థితి దేశంలో ఇంకా నెలకొనలేదు. రెండు డోసులు టీకా అయిపోయినా సరే 'మాస్కే కవచం' అంటున్నారు వైద్యులు. చాలామంది మాస్కులైతే ధరిస్తున్నారు కానీ వాటిని ఎలా ధరించాలో తెలుసుకోలేకపోతున్నారు. దీంతో కోవిడ్ బారిన పడి 'మాస్కు ఉన్నా సరే కోవిడ్ వచ్చిందని' వాపోతున్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే లాభం లేదు కదా.. అందుకే మాస్కును సరైన పద్ధతిలో ధరించాలని వైద్యులు చెబుతున్నారు.

## మాస్కు ధరించే పద్ధతి

1. మాస్కును తాకే ముందు చేతులు శుభ్రపర్చుకోవాలి.
2. ఉతికిన మాస్కునే ధరించాలి.
3. ముఖానికి, మాస్కుకు మధ్యలో ఖాళీ లేకుండా సర్దు బాటు చేసుకోవాలి.
4. నోటిని, ముక్కును, గడ్డాన్ని మాస్క్ తో పూర్తిగా కప్పాలి.
5. పదే పదే మాస్కును తాకుతుండటం మానుకోవాలి.
6. తీసేటప్పుడు మాస్కుకున్న తాళ్లు పట్టుకుని చెవి వెనుక నుండి తీయాలి.
7. తీసిన మాస్కును దూరంగా ఉంచాలి.
8. మాస్కును తిరిగి వాడాలనుకుంటే తాళ్లు పట్టుకునే వాడాలి.
9. ప్రతిరోజూ మాస్కును సబ్బు లేదా సర్ఫ్ ఉపయోగించి వీలైతే వేడి నీళ్లతో శుభ్రం చేయాలి.

## చేయకూడని పనులు

1. మాస్కును ఎట్టి పరిస్థితిలో ముక్కు కిందికి రానీయకూడదు.
2. ఒక మీటర్ దూరంలో ఎవరైనా ఉంటే మీ మాస్కును తీయకండి.
3. ఊపిరి తీసుకోవడానికి కష్టం కలిగించే మాస్కును వాడకండి.
4. పాడైనట్టుగా ఉన్న మాస్కును ధరించకండి.
5. వదులుగా ఉన్న మాస్కును కూడా వాడకూడదు.
6. మురికిగా ఉన్నా లేక తడిగా ఉన్న మాస్కు ధరించడం మంచిది కాదు.
7. మీ మాస్కును ఇతరులతో పంచుకోవద్దు.

❖ *(యూనిసెఫ్ సౌజన్యంతో...)*

# మాస్కే కవచం



మతపెద్దల మధ్య అవగాహన కార్యక్రమం



అనంతపురం జిల్లా అధికారుల మధ్య అవగాహన కార్యక్రమం

కోవిడ్ పై ప్రజల్లో చైతన్యం కలిగించాలనే ఉద్దేశంతో **SBCC (Social and Behavioural Change Communication)** సెల్ యూనిసెఫ్ ఆధ్వర్యంలో గ్రామ, వార్డు సచివాలయ శాఖ 'మాస్కే కవచం' అనే ఒక బృహత్తర కార్యక్రమాన్ని జూలై 1న అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రారంభించింది. జిల్లా స్థాయిలో జాయింట్ కలెక్టర్ల (గ్రామ, వార్డు సచివాలయాల శాఖ) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి. కోవిడ్ పూర్తిగా తగ్గుముఖం పట్టేవరకు ఈ చైతన్య కార్యక్రమాన్ని అనేక విధాలుగా చేపట్టనున్నారు.

❖ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో SBCC జిల్లా సమన్వయకర్తలతో 'మాస్కే కవచం' చైతన్య కార్యక్రమాన్ని విస్తారంగా ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రచార సామాగ్రితో అవగహన కలిగించనున్నారు.

❖ ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, దుకాణాల ఎదుట ఈ ప్రచార సామాగ్రిని ప్రదర్శించి ప్రజల్లో జిల్లా అధికారులు అవగహన కల్పిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా మత పెద్దల్ని, రాజకీయ నాయకుల్ని, ప్రభుత్వ అధికార్లుని కలసి యూనిసెఫ్ సంస్థ ప్రత్యేకంగా రూపొందించిన పోస్టర్స్ మరియు కరపత్రాలను అందిస్తున్నారు.

❖ జిల్లాలో సంయుక్త కలెక్టర్స్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి. జిల్లాలో SBCC జిల్లా సమన్వయకర్తలు కోవిడ్ పై ప్రజల్లో ఎలాంటి అపోహలు లేకుండా మరింత అవగహన కల్పిస్తున్నారు.

# చెంప దెబ్బ

కథ



**హలో.. నమస్తే అండీ.**

నమస్కారం అమ్మా.. ఎవరు మీరు?

నేను 'అనిరుద్' వాళ్ల మమ్మీనండి.

ఓహో.. మీరా అమ్మా.. చెప్పండి..

వైరస్ నుంచి తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు కద్సార్..

తీసుకుంటున్నానమ్మా.

అయినా పిల్లలకు మొన్నటి నుంచి ఆన్‌లైన్ క్లాసులు కదా.

ఔను తెల్సండి. చాలా సంతోషం. మీరు ఆ నిర్ణయం తీసుకున్నందుకు. అయినా బయట అంతా విషాదంగా ఉంది కదా.. పలకరింపు కోసం అడిగానండి.

థాంక్యూ అమ్మా... అడిగినందుకు. మీరు అనిరుద్ కూడా జాగ్రత్తగా ఉండండి. అతను ఇప్పుడు ఆరవ తరగతేగా.. పైగా బాగా చదువుతున్నాడు కాబట్టి మీకు చెప్పాల్సిందేమీ లేదు.

అవున్సార్ బాగా చదువుతున్నాడు.

కానీ కోపమెక్కువవుతోంది ఈ మధ్య.

ఔనా...ఎందుకూ?

ఎందుకోనండి. నిన్న ఖాళీగానే ఉన్నాడు కదా.. అని పాపను కాసేపు వాడి దగ్గర కూర్చోబెట్టుకుని 'అ, ఆ'లు నేర్పమన్నాను. వాడు ఆ రెండు అక్షరాలు నేర్పడానికి పాపను కొట్టి కొట్టి పెట్టాడు. పాప భరించినంత సేపు భరించి తర్వాత ఏడుస్తూ వంటింట్లోకి వచ్చి నాకు ఫిర్యాదు చేసింది. అదేంట్రా అని అడిగితే 'అది ఎంత చెప్పినా నేర్చుకోవట్లేదమ్మా..' అంటున్నాడు చిరాగ్గా.

ఔనా.. బాబుకివ్వండి ఫోన్. నేను మాట్లాడుతాను.

గుడ్‌మార్నింగ్ సార్.

గుడ్ మార్నింగ్ నాన్న ఎందుకు పాపను కొట్టావంటా.

ఊ..

ఊకొట్టడం కాదు నాన్న.. జవాబు చెప్పాలి. అలా కొట్టకూడదు సరేనా.

ఊ...

ఏది ఒకసారి పాపను కొట్టను అని నోటితో చెప్పు.

ఊ..

అదిగో మళ్లీ ఊకొడుతున్నావ్. నోరు తెరిచి చెప్పాలి.

అంటే.. టీచర్లు అలాగే చేస్తారు కద్సార్..

..............

హలో..

అ.. అ.. అలా ఎప్పుడు టీచర్లు చేయరు నాన్నా..., నేనెప్పుడైనా నిన్ను కొట్టానా.. చెప్పు...?

సార్.. అమ్మ మాట్లాడుతుందంటా..

ఇవ్వునాన్న.. ఫోన్ ఇవ్వు...

హలో అండీ...

చెప్పండమ్మా..

బాబు ఇప్పటిదాక కొట్టడమే నేర్చుకున్నాడు సార్... రేపటి నుంచి అబద్ధం చెప్పడం నేర్చుకుంటాడేమో భయంగా ఉంది..

అమ్మా.. మీరు తల్లి. అంటే తొలి గురువులు. మీ దగ్గర దాపరికం ఎందుకు కానీ ఒకసారి ఏదో అలా జరిగింది. మళ్లీ ఇంకోసారి ఆ పొరపాటు జరగదు. సరేనా.

ధన్యవాదాలు సార్.

ఉంటానమ్మా..ఫోన్ పెట్టేస్తున్నాను. థాంక్యూ.

**– వేంపల్లె షరీఫ్**

***96034 29366***

కవితా గళం

# సత్య గీతం

మగువా, ఓ మగువా
నీ ప్రస్థానం ఆదిలో
ఓ 'నవజాతశిశువు'గా..
నలువైపులా నాలుగడుగులు వేస్తూ,
బాల్య జీవితంలోకి అడుగెట్టిన బాలికగా..
భారతవని/విశ్వంలో నీకంటూ స్థానాన్ని పదిలపరుచుకొనటకై
విద్యనభ్యసిస్తున్న ఓ విధూషి..
విద్య ద్వారా ఆయారంగాల్లో నీకంటూ
ఓ స్థాయిని ఏర్పరుచుకున్న ఓ కోమలీ..
వివాహవ్యవస్థలో భాగస్వామ్యమై 'కళత్రము'గా నీ పాత్రను ధరిస్తూ
వసుదైక కుటుంబ భావనకు పునాది వేసిన ఓ ఉదజని..
పురిటి నొప్పులను భరిస్తూ, పుడమిపైకి నీ సంతతిని అందించిన
ఓ అవని.. నీకు నీవేసాటి..
పుడమిపై భాషలన్నీ వడకట్టి వెదికిన..
'జనని' అను పదమునకు సమం లేదు
అవని యందు, నీవే యనురాగ దేవతవి,
అలుపెరగని ఓర్పువమ్మా నీవు
పురాణాల్లో నీకంటూ, ఓ ప్రాశస్త్యాన్నీ
చాటుకున్న ఓ పరికిణీ..
నేటి ఆధునికయుగంలో నీ పాత్రపై సందిగ్ధత ఏర్పడిందా?
క్రూరమైన ఆలోచనల నడుమ అశ్రువులు బాసి,
ప్రాణాలను సైతం కోల్పోయిన నాడు
ఓ'శ్రీలక్ష్మీ'వి నీవే! ఓ 'నిర్భయవి' నీవే! ఓ 'దిశ'వి నీవే!!
పతనమైన విలువలను, ఈ పుడమిపై విత్తులవలే
వెదజల్లే బృహత్తర బాధ్యత నీదే..
ఎన్ని జరిగినా, ఏమైనా నీ దిశ, నిర్దేశనం లేని
పురుషుడి జీవనగమనం 'తెరచాప' లేని
ఓడ ప్రయాణం లాంటిది
(కళత్రము= భార్య)



**– పి. గౌరినాయుడు** (M.Sc., M.A., M.A, M.Ed.)
**వెల్ఫేర్ అసిస్టెంట్, తిప్పవలస, విజయనగరం. 9494979258**

# సేవకు చిరునామా

**రాష్ట్రంలో గడప వద్దకే పాలన అనే స్ఫూర్తి నిరాటంకంగా కొనసాగుతోంది. సూర్యుడి కన్నా ముందే లేచి ఇంటి తలుపు తట్టి వివిధ రకాల సేవలను ప్రజలకు అందిస్తున్నారు వాలంటీర్లు. మచ్చుకు కొన్ని ఉదాహరణలు చూద్దాం.**



**ఆమె పేరు రత్నకుమారి.** పశ్చిమ గోదావరిజిల్లాలోని ఉంగ్రాజవరం మండలం సూర్యారావు పాలెం గ్రామంలో వాలంటీరుగా పనిచేస్తోంది. ఊళ్లో కొనకళ్ల వీరమ్మ అనే వృద్ధురాలికి పింఛను ఇవ్వాల్సి ఉంది. చూస్తే ఇంట్లో వీరమ్మ లేదు. అనారోగ్యంతో ఆమె ఉంగుటూరు మండల ఆస్పత్రిలో చూపించుకుంటూ అక్కడే ఉన్న కుమారుని ఇంట్లో ఉంటోంది. విషయం తెలుసుకున్న వాలంటీరు సొంత ఖర్చులతో ఉంగుటూరు వెళ్లి బాధితురాలికు పింఛను డబ్బులు ఇచ్చి వచ్చింది. వాలంటీరు అంకితాభావానికి స్థానికులు, అధికారులు అభినందనలు తెలుపుతున్నారు.



**అతని పేరు సోడదాసు గోపిచంద్.** తూర్పు గోదావరి జిల్లాలోని చింతలపల్లి గ్రామంలో వాలంటీరుగా పనిచేస్తున్నాడు. ఊళ్లో అద్దేపల్లి వెంకట సుబ్బలక్ష్మికి పింఛను మంజూరైంది కానీ ఈకేవైసి పూర్తి కాలేదు. దీంతో ఆమె ఇంటి దగ్గరికెళ్లాడు కానీ ఆమె లేదు. అనారోగ్యంతో పశ్చిమగోదావరి జిల్లా భీమవరం ఆస్పత్రిలో చికిత్స పొందుతోందని తెలిసింది. ఇలాంటి సమయంలో ఆమెకు పింఛను ఎంతో అవసరమని ఆలోచించిన గోపిచంద్ వెంటనే ఆమెను వెతుక్కుంటూ వెళ్లి ఈకేవైసి వివరాలను నమోదు చేయించుకున్నాడు. ఇలా తనను ఆస్పత్రి దగ్గరికే వెళ్లి సేవలు అందించేలా ప్రోత్సహించిన పంచాయితీ కార్యదర్శి శుభాకర్ బాబు, వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రసాద్‌కు థాంక్స్ చెబుతున్నట్టు అతను 'గ్రామ స్వరాజ్యం' పత్రికకు తెలిపాడు.



**అతని పేరు అరిగెల శ్రీనుబాబు.** పశ్చిమగోదావరి జిల్లా ముక్కామల గ్రామంలోని క్లసర్ 14లో వాలంటీరుగా పనిచేస్తున్నాడు. తన క్లస్టర్ పరిధిలో రెండు కాళ్లు లేని పాలెపు మహాలక్ష్మి ఉంది. ఆమె గతంలో పింఛన్ కోసం ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ చక్కర్లు కొట్టేది. ఇప్పుడు ఆమెకు ఆ అవసరం లేదు. ఇంటి వద్దకే పింఛను వచ్చి వాలుతోంది. రెండు కాళ్లు లేని తాను బయటికెళ్లాలంటే చాలా కష్టమని అలాంటిది  ఏ ఇబ్బంది, దిగులూ లేకుండా నెలా నెలా ఇంటి వద్దకు పింఛను వస్తోందని అందుకు కారణమైన వాలంటీరుకు ఆమె థాంక్స్ చెప్పుకుంటోంది. ఈ విషయం శ్రీను బాబు 'గ్రామ స్వరాజ్యం' పత్రికకు స్వయంగా తెలియజేస్తూ తన గురించి రెండు ముక్కలు ఇలా రాసుకున్నాడు.

"పోలీస్ లేకపోతే రక్షణ లేదు
డాక్టర్ లేకపోతే వైద్యం లేదు
ఇంజనీర్ లేకపోతే అభివృద్ధి లేదు
కానీ, వాలంటీర్ లేకపోతే
పైవి ఏవీ లేవు!
అందుకే నా జీవిత కథకు నేను
పెట్టుకున్న పేరు గ్రామ వాలంటీర్."

## రచనలు పంపండి

ఈ పత్రిక మీది, మాది మనందరిదీ. దీన్ని రానున్న రోజుల్లో మరింత అందంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నాం. సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు తమ అనుభవాలు, విజయగాథలు రాయండి. చక్కటి ఫోటోలు కూడా జత చేయండి. అంతేకాదు కథలు, కవితలు, వ్యాసాలు, బుక్ రివ్యూలు, తోటి  ఉద్యోగులతో పంచుకునే విషయాలు ఏవైనా సరే రాసి పంపండి. వీలు వెంబడి ప్రచురిస్తాం.

*మీ రచనలు అందాల్సిన చిరునామా:*
కమిషనర్, గ్రామ, వార్డు
సచివాలయాల శాఖ
రాష్ట్ర కార్యాలయం, నిర్మాణ్ భవన్,
జవహర్ ఆటోనగర్, విజయవాడ,
కృష్ణా జిల్లా - 520 007.
మెయిల్ ఐడి :
gswsmedia@gmail.com

## సచివాలయ ఉద్యోగుల శిక్షణ కోసం యూట్యూబ్ చానల్

*మనం చేస్తున్న పని మీద మనకు శ్రద్ధ ఉండాలి. విధుల పట్ల అవగాహన ఉండాలి. ఏమి చేయాలి.. ఎలా చేయాలి, ఏవి చేయకూడదు వంటి విషయాల మీద సాధికారత ఉండాలి. అప్పుడే ప్రభుత్వం తరపున సేవకులుగా మనం ప్రజల దగ్గర మన్ననలు అందుకోగలుగుతాం. మనం టెక్నాలజీలో అప్‌డేట్‌లో ఉండి ఎప్పటికప్పుడు కొత్త విషయాలు తెలుసుకోవడానికి గ్రామ, వార్డు సచివాలయాల శాఖ, శిక్షణా విభాగం వారు అనేక వీడియోలను రూపొందించారు.*

*వివిధ రంగాల నిపుణులతో రూపొందించిన వీడియోలను GSWS TRAININGS అనే యూట్యూట్ చానల్‌లో ఉంచారు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే subscribe చేసి అక్కడే ఉన్న Bell బటన్ నొక్కండి. దీనివల్ల భవిష్యత్తులో అప్ లోడ్ చేసే వీడియోల వివరాలు మీకు నోటిఫికేషన్ ద్వారా ఎప్పటికప్పుడు తెలుస్తాయి. మర్చిపోవద్దు.. GSWS TRAININGS అనే యూట్యూబ్ చానల్‌ని subscribe చేయడం ప్రతి సచివాలయ ఉద్యోగి బాధ్యత.*

**GSWS TRAININGS చానల్‌ని వెంటనే SUBSCRIBE చేయండి.**

*Link: https://www.youtube.com/channel/UCY8REcSq2ZCl0NmLTl2hKRA/videos*

గ్రామ, వార్డు సచివాలయ శాఖ, రాష్ట్ర కార్యాలయం, శిక్షణా విభాగం, విజయవాడ.